సాక్షి
మంచిర్యాల

శుక్రవారం ׀ 30 ׀ జూన్ ׀ 2023



విజయం మీదే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం గ్రూప్–4 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రశాంతంగా పరీక్ష రాస్తే కొలువు సాధ్యమేనని నిపుణులు సూచిస్తున్నారు. 8లో ▸

319 మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో టీఎస్ ఎంసెట్–2023 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం 319 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. విద్యార్థులు సాధించిన ర్యాంకు ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సర్టిఫికెట్లు పరిశీలించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /17.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



మంచిర్యాలలోని బస్టాండ్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు





శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మంచిర్యాలలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఈద్గా, క్వారీ రోడ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ పండుగ సందేశాన్ని ఇచ్చారు. గురువారం ప్రార్థనల అనంతరం ఈద్గాల వద్ద స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావుతోపాటు పలువురు వేర్వేరు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, డీసీ సీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, టీఆర్ఎస్ యువ నాయకుడు విజిత్‌రావు, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సంజీవ్, పీసీసీ సభ్యుడు కొండ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు పూదరి తిరుపతి, నరేష్, భానేష్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'తొలి' పూజలు



మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో ఏకాదశి వ్రతంలో భక్తులు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



వేమనపల్లి ప్రాణహిత నదిలో భక్తులు

మంచిర్యాలఅర్బన్: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నది, ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మంచిర్యాలలోని విశ్వనాథస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి, శివుడు, వాసవి కన్యకాపరమేశ్వరిని భక్తులు దర్శించుకున్నారు. శివునికి అభిషేకం చేశారు. మహిళలు ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ కోటి తీర్థాల పుణ్యఫలం ఈ రోజు తొలి ఏకాదశి పర్వదినం అన్నారు. పట్టణంలోని ఆలయాల్లో భక్తులతో సందడి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విజిత్‌రావు దైవదర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కౌన్సిలర్లు మాదంశెట్టి సత్యనారాయణ, సురేష్‌బల్దువా, హరికృష్ణ, విశ్వనాథ ఆలయ కమిటీ ఈవో ముక్తా రవి, అర్చకులు బాలకృష్ణశర్మ, నరహరిశర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సత్యదేవుణ్ని దర్శించుకున్న జడ్జిలు



దర్శించుకుంటున్న న్యాయమూర్తులు

దండేపల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని గూడెం సత్యనారాయణస్వామిని మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి అజయ్, బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శన అనంతరం అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

గణంకాల కచ్చితత్వంలో అధికారులు కీలకం



గణాంకాల దర్శినిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నస్పూర్: గ్రామ స్థాయి నుంచి గణాంకాలు కచ్చితత్వంతో రూపొందించడంలో మండల అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల కార్యాలయం భవన సమావేశ మందిరంలో గురువారం ప్రొఫెసర్ ప్రశాంత్ చంద్రమహాల నోబీస్ 130వ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. గణాంక దర్శినిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించాలి

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని సీఐటీయూ శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి కార్మికుల పిల్లలు సీబీఎస్ఈ సిలబస్ కోసం ఇతర ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని తెలిపారు. సింగరేణి అతిపెద్ద సంస్థ అయినందున సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు.

బోదకాల వ్యాధి నివారణకు కృషి చేయాలి



బ్రోచర్లు అందిస్తున్న వైద్యాధికారులు

శ్రీరాంపూర్: బోదకాల వ్యాధి నివారణ కోసం కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డిని కోరారు. డబ్ల్యూహెచ్ఓ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ రాజేంద్రకుమార్‌సింగ్, డాక్టర్ శిరీషాపటేల్, డాక్టర్ కమలాకర్‌అర్జున్ లస్కరే, జిల్లా బోదకాల వ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత గురువారం ఏరియా జీఎంను కలిసి ఈ వ్యాధి వివరాలను వెల్లడించారు. వ్యాధి నివారణ, వ్యాధిగ్రస్తులకు చికిత్సపై వివరించారు.

తీరిన పోడుగోస!



ఆసిఫాబాద్‌లో బహిరంగ సభకు ముస్తాబవుతున్న వేదిక

- సీఎం కేసీఆర్ చేతులమీదుగా పంపిణీ
- నేడు ఆసిఫాబాద్‌లో లబ్ధిదారులకు అందజేత
- అన్ని నియోజకవర్గాల్లో ఇచ్చేందుకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు గోస తీరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏళ్లుగా అర్హులైన వారికి పట్టాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం పట్టాలు ఇస్తుండడంతో అటవీ భూములు సాగు చేసుకునేందుకు చట్టపరమైన హక్కులు దక్కనున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోడు సాగుదారులు ఉన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో అటవీ అధికారులు, సాగుదారులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడేది. అటవీభూములు సాగు చేస్తున్న వారిలో గిరిజన, గిరిజనేతరులు ఉన్నారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాలనే డిమాండ్లు వచ్చాయి. చివరగా అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. అప్పట్లో కొంతమంది పట్టాలు రాలేదనే కారణంగా మళ్లీ సర్వే చేసి అర్హులను గుర్తించాలని వినతులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పోడు పట్టాలు ఇస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు గత రెండేళ్లుగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జరిగింది. తాజాగా ఎంపిక చేసిన అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు అందిస్తోంది. పోడు పట్టాలు ఇచ్చిన వెంటనే వారికి రైతుబంధు వర్తింపజేసేందుకు బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకుని, పెట్టుబడి సాయం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదట ఈ నెల 24న పంపిణీ చేయాలని భావించినా వీలు కాలేదు. చివరకు శుక్రవారం రోజునే పంపిణీ జరుగుతోంది.

నియోజకవర్గాల వారీగా పంపిణీ..

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచే పోడు పట్టాల పంపిణీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్వహిస్తారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరూ ఆసిఫాబాద్‌కు వెళ్తుండడంతో ఈ రోజు ఆసిఫాబాద్ నియోజకవర్గం తప్ప మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల్లో పంపిణీ జరగడం లేదు. ఎమ్మెల్యేల షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల వారీగా అర్హులకు ప్రత్యేక సభలు నిర్వహించి పట్టాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పంపిణీ చేయాల్సిన పట్టా పాస్‌బుక్‌లు జిల్లా రెవెన్యూ అధికారుల వద్దకు చేరాయి.

ఉమ్మడి జిల్లాలో పోడు పట్టాల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	ఎకరాలు
కుమురంభీం	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
నిర్మల్	7,257	20,051
మంచిర్యాల	2,403	5,024

గిరిజనేతరులకు లేనట్లే?

అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే పోడు హక్కులు కల్పించే అవకాశం ఉండడంతో వారికి మాత్రమే ప్రస్తుతం పట్టాలు అందజేస్తున్నారు. పోడు దరఖాస్తుల్లో గిరిజనేతరులవే అధికంగా వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 33వేల మంది గిరిజనులు, 1.24లక్షల ఎకరాలకు పోడు హక్కు ల కోసం వినతులు ఇచ్చారు. 32వేల మంది వరకు గిరిజనేతరులు 1.02లక్షల ఎకరాలకు దరఖాస్తులు ఇచ్చారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి పోడు కమిటీలు అందరి దరఖాస్తులు పరిశీలించి అ టవీ, రెవెన్యూ, పంచాయతీ శాఖల పరిశీలన తర్వా త తుది జాబితాను సిద్ధం చేశారు. ఇందులో గిరిజనేతరులకు పోడు హక్కుల పట్టాలు ఇవ్వడం లేదు.

నేడు ఆసిఫాబాద్‌కు కేసీఆర్

- సీఎం పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ కార్యాలయాలు ప్రారంభం
- ఇక్కడి నుంచే పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం
- కుమురం భీం, కోట్నాక భీంరావు విగ్రహాల ఆవిష్కరణ
- ఆసిఫాబాద్ పట్టణంలో భారీ బహిరంగ సభ

సాక్షి, ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమురంభీం జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రెండు రోజులుగా రేయింబవళ్లు కష్టపడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆసిఫాబాద్‌కు రానున్న సీఎం కేసీఆర్ తొలుత కుమురం భీం చౌక్‌కు చేరుకుంటారు. అక్కడ కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయనకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. తరువాత పక్కనే ఉన్న పిల్లల పార్కుకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి ఆ భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్ సముదాయానికి చేరుకుంటారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించి కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందితో మాట్లాడుతారు. తరువాత కలెక్టరేట్‌లోనే దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 12 మంది గిరిజన రైతులకు సీఎం చేతుల మీదుగా హక్కుపత్రాలను అందజేస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభాస్థలికి చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. తిరిగి 5 గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పయనమవుతారు.

ఆరెకరాల్లో బహిరంగ సభ..

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా జైలు సమీపంలోని ప్రేమలా గార్డెన్ వద్ద ఆరెకరాల్లో బహిరంగ సభకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ముఖ్యమంత్రితోపాటు పార్టీ ముఖ్యనేతలందరూ కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు పార్టీ సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. వేదిక వద్ద మహిళల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశారు. అలాగే వారికి భోజనాలు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

2,300 మందితో బందోబస్తు..

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డీఐజీ రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, కరీంనగర్ పీటీసీ ఎస్పీ అరవింద్‌తోపాటు 15 మంది అడిషనల్ ఎస్పీలు, 49 మంది సీఐలు, 159మంది ఎస్సైలు, 12 మంది మహిళా ఎస్సైలు, 264మంది ఏఎస్సైలు, 1,100మంది పీసీలు, 109మంది మహిళా పీసీలు, 200మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, 300మంది సీఎం సెక్యూరిటీ, స్పెషల్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి మొత్తం 2,300 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

పర్యటన ఇలా..

ఉదయం..

10.55 : ప్రగతిభవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

11.00 : బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో ఆసిఫాబాద్ బయల్దేరుతారు.

మధ్యాహ్నం..

12.05 : ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.

12.15 : కుమురంభీం చౌక్‌లోని కుమురంభీం విగ్రహావిష్కరణ.

12.35 : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

1.10 : పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహావిష్కరణ.

1.30 : జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

2.00 : సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు. పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తారు. అక్కడ భోజనం చేశాక కలెక్టరేట్ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.

4.00 : బహిరంగ సభ

సాయంత్రం..

5.00 : కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్ హైదరాబాద్‌కు పయనం.

6.15 : బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

6.25 : బేగంపేట నుంచి ప్రగతిభవన్‌కు చేరుకుంటారు.

సాయిచందుకు ఘన నివాళి



రామకృష్ణాపూర్‌లో సాయిచందు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

మంచిర్యాలటౌన్/రామకృష్ణాపూర్: తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచందుకు బీఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, నరెడ్ల శ్రీనివాస్, సుదమల్ల అశోక్‌తేజ, బోడ ధర్మేందర్, శెట్టి శ్రీనివాస్, జెట్టి చరణ్, చంద్రమౌళి, రాచర్ల శ్రావణ్, బొజ్జ శేఖర్, శ్రావణ్, చందు, నరేశ్ పాల్గొన్నారు. రామకృష్ణాపూర్‌లో రామాలయం యూత్ సభ్యులు చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద గురువారం సాయంత్రం సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

సబ్సిడీపై కొబ్బరి మొక్కల పంపిణీ



నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు

భీమారం: చెన్నూరు ప్రాంతంలో కొబ్బరి తోటల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సబ్సిడీపై మొక్కలు అందజేస్తామని ఐటీడీఏ హార్టికల్చర్ నర్సరీ సబ్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన నర్సరీలో మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి తోటలతోపాటు కొబ్బరి తోటల పెంపకాన్ని రైతులు చేపట్టాలని అన్నారు. ఇక్కడి భూములు కొబ్బరి తోటలకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. 150 రూపాయల మొక్కను రైతులకు రూ.50కి అందజేస్తున్నట్లు తెలిపారు. పట్టాభూములు కలిగిన రైతులు పట్టా పుస్తకాల జిరాక్స్ కాపీలతోపాటు ఆధార్ కార్డు అందజేస్తే మొక్కలు అందజేస్తామని అన్నారు. రైతులు తోటల పెంపకం చేపట్టిన అనంతరం హార్టికల్చర్ శాఖ వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అవసరమైన సలహాలు అందజేస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

ముళ్లపొదల్లో చిక్కుకుని మెకం మృతి


మృతిచెందిన మెకం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీ శివారులోని అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన ఓ మెకం గురువారం మృత్యువాతపడింది. స్థానికుల వివరాల ప్రకారం... నంనూర్ పునరావాస కాలనీకి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం నుంచి జనావాసంలోకి వచ్చిన మెకం స్థానిక వీధి కుక్కల కంటపడింది. దీంతో కుక్కల బారి నుంచి కాపాడుకోవడానికి పరిగెత్తి ఓ ముళ్లపొదల్లో చిక్కుకునిపోయింది. అప్పటికే పరిగెత్తి అలసిపోయి ముళ్లపొదల్లో గిలగిల కొట్టుకుంటూ స్థానికులకు కనబడింది. తీవ్ర ప్రయత్నం మేరకు దానిని బయటకు తీసినా అప్పటికే చనిపోయింది. దీంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. పంచనామా చేసి ఖననం చేస్తామని లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి నాగావత్ స్వామి తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఇనుప రాడ్‌తో కొట్టడంతో వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. హన్మాన్‌బస్తీకి చెందిన సత్తయ్య(58) పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. రోజు తాగి వచ్చి బస్తీలో అందరి ముందు పరువు తీసేవాడు. ఈ క్రమంలో బుధవారం సైతం అలాగే చేయడంతో కొడుకు ఇనుపరాడ్‌తో తలపై బాదాడు. తలకు గాయం కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి పరీక్షించిన వైద్యులు సత్తయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లపేటకు చెందిన ఓ మహిళ తప్పిపోయినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాళ్లపేటకు చెందిన గడికార్ సురేష్‌తో 2014లో శిరీషతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ప్రణీత్, ప్రణయ్ ఉన్నారు. ఇటీవల సురేష్, శిరీషలకు గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన శిరీష ఈ నెల 28న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శిరీష ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలోనూ, చుట్టుపక్కల వెతికినా సమాచారం లేకపోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో సురేష్ ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారులకు గజ్జెపూజ


గజ్జెపూజ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

తాండూర్: మండల కేంద్రంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గడిచిన రెండు నెలల నుంచి బాలికలకు అభినవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ముగింపులో భాగంగా గురువారం చిన్నారులకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రధాన అర్చకులు దాగం వినాయకరావు, నృత్యాచార్యులు బిట్ల వెంకటస్వామి గజ్జెపూజ నిర్వహించారు.

వ్యూహం అనుసరిస్తే విజయం మీదే..

- రేపే గ్రూప్–4 పరీక్ష...
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఉద్యోగాలకు తీవ్ర పోటీ...
- ప్రశాంతంగా రాస్తే కొలువు నులువేనంటున్న నిపుణులు


నిర్మల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

వివరాలు:
పరీక్ష : జూలై 1న శనివారం
పేపర్ 1: ఉదయం 10:00 నుంచి 12:30 వరకు
పేపర్ 2: మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 వరకు

నిర్మల్ ఖిల్లా: సాధారణ డిగ్రీ అర్హత గలిగిన జిల్లా స్థాయి పోస్టుల్లో అత్యంత కీలకమైనవి గ్రూప్–4 ఉద్యోగాలు. వీటి కోసం టీఎస్పీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. శనివారం నిర్వహించే గ్రూప్ 4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహించనున్నారు. సరైన వ్యూహంతో పరీక్ష రాస్తే ప్రభుత్వ కొలువును ఈజీగాసాధించవచ్చని పోటీ పరీక్షల నిపుణులు పేర్కొంటున్నారు.

8039 పోస్టుల భర్తీ...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 25 శాఖల్లోని మొత్తం 8,039 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయగా నిర్మల్ జిల్లాకు దాదాపు 200, రాష్ట్ర స్థాయి కోటాలో మరో 375 ఉద్యోగాలకు ఆయా శాఖల వారీగా పోటీపడే అవకాశం ఉంది. సాధారణ డిగ్రీ అర్హత కలిగిన ఈ గ్రూప్ 4 పరీక్షకు పీజీ, బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ తదితర ఉన్నత చదువులు అభ్యసించిన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా వెలువడిన గ్రూప్ 4 నోటిఫికేషన్‌కు తీవ్రమైన పోటీ నెలకొంది.

గ్రూప్ 4 పరీక్ష ఇలా...

గ్రూప్ 4 పరీక్ష రెండు పేపర్లుగా 300 మార్కులకు ఉంటుంది. పేపర్ 1 జనరల్ స్టడీస్ 150 మార్కులకు, పేపర్ 2 సెక్రటేరియట్ ఎబిలిటీస్ 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం ఉంటుంది. పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రతిపాదికన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మెరిట్ రూపొందించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

ఉమ్మడి జిల్లా వివరాలు...

జిల్లా	అభ్యర్థుల సంఖ్య	పరీక్షకేంద్రాల సంఖ్య	పరీక్ష కేంద్రాలు
నిర్మల్	15,475	54	నిర్మల్, భైంసా, ఖానాపూర్
ఆదిలాబాద్	17,771	54	ఆదిలాబాద్, మావల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్
మంచిర్యాల	27,801	94	మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, నస్పూర్, జైపూర్
కుమురంభీం	8,251	33	ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, వాంకిడి, సిర్పూర్(టి), రెబ్బెన

పరీక్షకు ముందు రోజు...

- పరీక్షకు ఒక రోజు ముందు అభ్యర్థులు సబ్జెక్టు ప్రిపరేషన్ కంటే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. పరీక్షకు ఒక రోజు ముందు రాత్రి అభ్యర్థులు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- పరీక్ష రోజున నిర్దేశిత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- కేటాయించిన స్థలం సరిచూసుకుని కూర్చున్న అనంతరం ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌ని చెక్ చేసుకోవాలి.
- సమాధానాలను గుర్తించే ముందు ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- సులభమైన ప్రశ్నలతో ప్రారంభించి ఓ మోస్తారు కాఠిన్యత, ఆ తర్వాత మరింత కాఠిన్యత ఉన్న ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి.
- తెలిసిన సమాధానాలకు గుర్తించిన తర్వాతనే ఎలిమినేషన్ విధానాన్ని, ఊహించి జవాబులు చేసే విధానాన్ని అనుసరించాలి.
- గ్రూప్ 4 మొదటి పేపర్ ముగిసిన తర్వాత రెండవ పేపర్ ప్రారంభానికి ముందు మధ్యాహ్నం రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు మొదటి పేపర్లో గుర్తించిన సమాధానాల గురించి చర్చించడం వంటివి చేయడం కరెక్ట్ కాదు. దీంతో అదనపు ఒత్తిడి పెరుగుతుంది.

ఒత్తిడికి గురికావొద్దు



పరీక్ష రోజున ఉదయం మొదటి, మధ్యాహ్నం రెండవ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు ఒత్తిడికి లోను కావద్దు. తెలిసిన సమాధానాలు మొదటగా గుర్తించాలి. తెలియని సమాధానం వద్దే ఆగిపోకుండా దానిని వదిలేసి ముందుకు వెళ్లాలి. ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోయినా ఆందోళన చెందవద్దు. రెండు పేపర్లలో ఎక్కువ మార్కులు సాధించేలా ప్రయత్నించాలి. – **కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోటీ పరీక్షల నిపుణులు, నిర్మల్**

ఇటిక్యాలలో విషాదం

- హైదరాబాద్‌లో విధి నిర్వహణలో కానిస్టేబుల్ మృతి
- చివరిచూపు కోసం గ్రామస్తుల ఎదురుచూపు


ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రామయ్య(ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన రామయ్య (48) స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ హైదరాబాద్‌లో తుపాకి మిస్ ఫైర్ కావడంతో గురువారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రాజలింగు, రాజవ్వ దంపతులకు నలుగురు కుమారులు. ఇద్దరు కూతుర్లు. చిన్నవాడైన రామయ్య 1998వ సంవత్సరంలో స్పెషల్ ప్రొటెక్షన్ పోలీస్ విభాగంలో ఉద్యోగం సంపాదించాడు. మంచిర్యాల, రామగుండం, కరీంనగర్‌తో పాటు పలు పట్టణాల్లో విధులు నిర్వహించి ఇటీవల హైదబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య ప్రమీల, కూతురు సరయు బీటెక్ చేస్తుండగా కుమారుడు సన్నీ డిగ్రీ చేస్తున్నాడు. గురువారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా తుపాకి సరిచేస్తున్న సమయంలో మిస్ ఫైర్ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురానున్నారు.

పండుగ పూట విషాదం..

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య గురువారం తుపాకి మిస్ ఫైర్ కావడంతో మృతి చెందిన వార్త గ్రామంలో తెలియడంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదం అలుముకుంది. మృతదేహం హైదరాబాద్ నుంచి వస్తుండడంతో గ్రామస్తులు చివరి చూపు కోసం ఎదురుచూస్తున్నారు. చిన్నప్పటి నుండి గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండేవాడని, ఇలా అకాల మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. స్థానిక ఎస్సై లక్ష్మణ్, పోలీసులు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

బోధకాలు దూరం చేద్దాం


డీవైఎస్ఎంఓతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

రామకృష్ణాపూర్: జిల్లా ప్రజలతో పాటు సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులందరికీ బోధకాలు వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలంగాణ రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేందర్ తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కమలాకర్, వరంగల్ జోనల్ కో–ఆర్డినేటర్ శిరీషా పటేల్‌తో కలిసి స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఆగస్టు 10న ప్రారంభించనున్న సామూహిక ఔషధ వినియోగం ప్రాధాన్యతను ఆస్పత్రి డీవైసీఎంవో డాక్టర్ ఉషారాణికి వివరించారు. అవర్‌మెక్టిన్, డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను రెండేళ్ల పైబడిన వారందరికీ వేసి బోధకాలు నివారణకు సహకరించాలని కోరారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సమగ్ర శిక్ష అభియాన్ పోస్టుల భర్తీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీడీ
- అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్న ఆనందోత్సాహాలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో పెండింగ్‌లోని సమగ్రశిక్షా అభియాన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు అనుమతిచ్చింది. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్, సిస్టం ఎనాలసిస్ట్, ఎంఐఎస్ కో ఆర్డీనేటర్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ పర్సన్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం 2019 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించి రాత పరీక్ష కూడా నిర్వహించారు. మెరిట్ జాబితాను సైతం ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ అనివార్య కారణాలతో ఈ నియమాక ప్రక్రియను నిలిపివేసింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయా అని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణకు తెర దించుతూ ఎస్పీడీ దేవసేన భర్తీకి అనుమతినిచ్చింది. ఈ నెల 30 నుంచి జూలై 13 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. గతంలో ఎంపికై నిరీక్షిస్తున్న వారిలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి ప్రక్రియ షురూ

ఆర్ఎంఎస్ఏ ద్వారా భర్తీ చేయనున్న ఈ పోస్టుల నియమాక ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 13వరకు ప్రక్రియ నిర్వహిస్తారు. 30న డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లో మెరిట్ జాబితా, జూలై 1న సినియార్టీ జాబితా ప్రకటన, 3న ప్రొవిజనల్ లిస్టు ప్రకటన, 4, 5 తేదీల్లో అభ్యర్థుల నుంచి అభ్యంతరాల స్వీకరణ, 7న కేటగిరీ వారీగా తుది జాబితా విడుదల , 10న సర్టిఫికేట్ల పరిశీలన, నియమాక పత్రాలను అందజేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులు 13వ తేదీలోగా సంబంధిత పోస్టుల్లో చేరాల్సి ఉంటుంది.

జిల్లా	ఎంఐఎస్ కోఆర్డీనేటర్	డీఈవో	సిస్టం అనాలిస్ట్	ఏపీవో	ఐఈఆర్పీ
ఆదిలాబాద్	05	07	00	01	11
నిర్మల్	08	07	01	01	14
మంచిర్యాల	06	05	01	01	10
ఆసిఫాబాద్	05	03	-	01	14

వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల లో గత ఏడాది కురిసిన భారీ వర్షానికి మునిగిపోయిన వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో గురువారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రధాని మోదీ సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ వర్షాకాలం మొదలుకావడంతో వరదలు వస్తాయని ప్రజలు భయపడుతున్నారని, వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బొద్దున మల్లేశ్, బండి మల్లికార్జున్, జోగుల శ్రీదేవి, కిశోర్, సత్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

మేదరిపేటలో మహాజన్ సంపర్క్ అభియాన్

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో 'మహాజన్ సంపర్క్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది ఏళ్లలో మోదీ సాధించిన విజయాలతో ముద్రించిన కరపత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రతీ దుకాణం, ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు గుండ ప్రభాకర్, మల్లేష్, రవి గౌడ్, సత్తయ్య, వెంకటేశ్ ఉన్నారు.


గణేష్‌నగర్‌లో ప్రధాని సాధించిన విజయాలను వివరిస్తున్న రఘునాథ్

ఊరిస్తున్న వందే భారత్ రైలు


వందేభారత్ రైలు

బెల్లంపల్లి: సికింద్రాబాద్–నాగ్‌పూర్ ప్రతిపాదిత వందే భారత్ రైలు ట్రయల్ రన్ నడుస్తోంది. ఈ మార్గంలో ఇప్పటికే ఐదారుసార్లు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. ఇప్పటి వరకు పెద్దగా అవరోధాలు తలెత్తనట్లుగా తెలుస్తోంది. నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య దూరం 581 కిలోమీటర్లు ఉండగా ప్రస్తుత ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణం సాగించడానికి గరిష్ఠంగా దాదాపు 10 గంటల సమయం పడుతోంది. వందే భారత్ రైలు ద్వారా గరిష్ఠంగా ఆరున్నర గంటల సమయం పట్టనున్నట్లు అంచనా వేశారు. సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై నాగ్‌పూర్ వెళ్లే క్రమంలో మార్గమధ్యలో ఉన్న ఖాజీపేట, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా రైల్వేస్టేషన్లలో ఆగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తిరుగు ప్రయాణంలో కూడా ఆయా రైల్వేస్టేషన్లలో ఆగేలా రైల్వే అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ ప్రాంత ప్రజలు సిర్పూర్‌కాగజ్‌నగర్, రామగుండం స్టేషన్ల నుంచి ప్రయాణించే అవకాశం ఉంది.

ఎదురు చూస్తున్నాం



వందే భారత్ రైలు కోసం ఎప్పటి నుంచో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. వ్యాపార, వాణిజ్యవర్గాలు ఆయా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అవసరాల రీత్యా రాకపోకలు చేస్తుంటారు. సూపర్ ఫాస్ట్ రైళ్లు లేకపోవడంతో అనివార్యంగా సాధారణ రైలులో వెళ్లాల్సి వస్తోంది. వందే భారత్ రైలుకు సత్వరంగా పచ్చజెండా ఊపి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.
– **మహేష్‌శర్మ, వ్యాపారి, బెల్లంపల్లి**

ఎంతో ప్రయోజనం



ప్రస్తుతం తగినన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లు ఈ మార్గంలో లేకపోవడంతో సాధారణ రైళ్లలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. గంటల కొద్దీ రైలులో కూర్చోవాల్సి రావడం వల్ల సమయం చాలా వృథా అవుతోంది. వందే భారత్ రైలును ప్రవేశ పెట్టడం మూలంగా సమయం కలిసి రావడంతోపాటు ప్రయాణం సుఖంగా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.
– **సురేష్ అగర్వాల్, వ్యాపారి, బెల్లంపల్లి**

ఆమెకే ఆ'పరేషాన్'!

- కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సపై తొలగని అపోహలు
- ఆపరేషన్లకు దూరంగా పురుషులు
- అవగాహన కల్పిస్తున్నా ముందుకు వస్తున్నది కొందరే..
- జూలై 10వరకు అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో గత ఆరేళ్లుగా చేసిన ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	ట్యూబెక్టమీ మహిళలకు	వేసెక్టమీ పురుషులకు
2018–19	3,402	57
2019–20	2,619	177
2020–21	2,156	128
2021–22	2,655	204
2022–23	2,423	37
2023–24	454	0 (ఇప్పటి వరకు చేసినవి)



మంచిర్యాలటౌన్: నవ మాసాలు బిడ్డను మోసి.. పురిటి నొప్పులు భరించి శిశువుకు జన్మనిచ్చిన తల్లిపైనే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స భారం పడుతోంది. చాలామంది పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్(వేసెక్టమీ)కు వెనుకంజ వేస్తుండడంతో మహిళలకు తప్పనిసరి పరిస్థితి ఎదురవుతోంది. మహిళలు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స(ట్యూబెక్టమీ) చేయించుకుంటే పరది రోజుల పాటు ఇబ్బంది పడడమే కాకుండా భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. కానీ పురుషులు వేసెక్టమీ చేయించుకుంటే రెండు మూడు రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకున్నారు. అయినా పురుషులు వేసెక్టమీకి ముందుకు రావడం లేదు. వేసెక్టమీ శస్త్రచికిత్స చేయించుకునేలా పురుషులకు అవగాహన కార్యక్రమాలు ఏటా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా మహిళలతో పోలిస్తే పురుషులు ఆపరేషన్లకు ముందుకు రావడం చాలా తక్కువగా ఉంటోంది. జిల్లాలో వేసెక్టమీ చేసేందుకు అవసరమైన సర్జన్ లేకపోవడంతో ముందుకు వచ్చినా ఆపరేషన్లు జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

పురుషులకు సులభం

కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురుషులకు చేసే వేసక్టమీ శస్త్రచికిత్స చాలా సులభం. కోత, కుట్టు లేని శస్త్రచికిత్స ఇది. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పూర్తయ్యే ఈ విధానంలో రక్తస్రావం ఉండదు. శస్త్ర చికిత్స అయిన వెంటనే చిన్న చిన్న పనులు నిరభ్యంతరంగా చేసుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. రెండు, మూడు రోజుల్లోనే పనులు చేసుకునే అవకాశం ఉండగా.. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవు. పురుషులకు గతంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయాలంటే తప్పనిసరిగా కోత పెట్టాల్సి వచ్చేది. ఆధునిక విధానమైన నో స్కాల్‌పల్ వేసెక్టమీ(ఎన్ఎస్‌వీ) అందుబాటులోకి రావడంతోపాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలోనూ నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో పురుషులు కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఇంటికి వెళ్లేందుకు అవకాశం ఉంది. మహిళలు ట్యూబెక్టమీ చేయించుకుంటే భవిష్యత్తులో ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శస్త్ర చికిత్స సమయంలో కడుపు కోత పెట్టాల్సి రావడంతో రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. కుట్లు మానడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. ఆరు నెలల వరకు బరువైన పనులు చేయడం కష్టంగా ఉంటుంది. అప్పటికే ఒకటి, రెండు కాన్పులు శస్త్రచికిత్స ద్వారా జరిగిన మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.

మహిళలకే అధికంగా...

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స విషయంలో పురుషులు, స్త్రీల మధ్య తారతమ్యం మారడం లేదు. భార్యాభర్తలిద్దరిలో ఎవరైనా ఒకరు చేయించుకునే అవకాశం ఉంది. నిత్యం బయటి పనులకు వెళ్లి కాయకష్టం చేసే పురుషులు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్న అపోహ ఇంకా నెలకొంది. ఇంట్లోని పెద్దలు సైతం ఈ సంప్రదాయానికి మరింత ఊతమిస్తుండడంతో శస్త్ర చికిత్సలు మహిళలకే పరిమితం అవుతున్నాయి. ట్యూబెక్టమీ ఆపరేషన్లు వేలల్లో జరుగుతుంటే, వేసెక్టమీ ఆపరేషన్లు వందల్లోనే ఉంటున్నాయి. గత ఆరేళ్లలో గరిష్ఠంగా 204 మంది పురుషులు మాత్రమే వేసెక్టమీ చేయించుకోవడం గమనార్హం.

పురుషులు ముందుకు రావాలి



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మహిళలకే కాదని, పురుషులు కూడా చేసుకోవాలని జిల్లా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ నెల 27 నుంచి జూలై 10వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, జూలై 11నుంచి 24వరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టేందుకు క్యాంపులు ఏర్పాటు చేస్తాం. పురుషులకే ఆపరేషన్లు చేసేలా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు వివరిస్తారు. జిల్లాలో పురుషులు కొందరు వేసెక్టమీకి ముందుకు వస్తున్నా పూర్తిస్థాయిలో రావడం లేదు. పురుషులకు చేసే కు.ని ఆపరేషన్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆపరేషన్ చేసిన రెండు మూడు గంటల్లోనే ఇంటికి వెళ్లి రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది.
– **డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, మంచిర్యాల**